
# ఎదురు దెబ్బ

సాయంత్రం ఏడు గంటలు కావస్తోంది. రకరకాల జంటలతో పార్కు కిటకిటలాడుతోంది.

పుట్టింటికి వెళ్లిన తన శ్రీమతిని గురించి ఆలోచిస్తూ...ఒంటరిగా ఓ మూల కూర్చున్నాడు మురళి.



వెళ్లబోయే ముందు తనకు శ్రీమతికి ఒకటే వాదన. బాబుతోనే వస్తానన్న శ్రీమతితో.. కాదు కూడదు పాపతోనే తిరిగి రావాలని పట్టుపట్టాడు తాను. ఇద్దరిలో గెలుపెవరిదో చూడాలి... కాదు కాదు తానే గెలవాలని వెయ్యి దేవుళ్లను మొక్కుతున్నాడు మురళి!!

పాప అయితే బావుంటుంది. ప్రతి క్షణం తన కళ్లముందు మెదిలే చనిపోయిన తన వెల్లాయిని చూసుకోవాలి ఆ పాపలో...!! వెల్లాయి తలపుకు రాగానే గత స్మృతులు మెదిలాయి తన మనసులో....

తనూ వెల్లాయి పి.జి చెయ్యటం కోసం హైదరాబాద్ వచ్చారు. తాను ఇంజనీరింగ్, వెల్లాయి ఎం.ఏలో చేరాక... ఇద్దరూ ఓ అద్దె గదిలో దిగారు. "వెల్లాయి క్లాస్‌మేట్ అయిన జీవన్... వెల్లాయిని ప్రేమిస్తున్నట్లు నటించి వాడి మూలంగా తల్లి కాబోతుందని తెలుసుకొని.. పారిపోయాడా దొంగ రాస్కెల్!! వాడు మోసం చేశాడన్న బాధతో చెల్లి ఇల్లు విడిచి వెళ్లిపోయిందానాడు. ఏమైపోయిందో ఏమిటో...ఎన్నో విధాల ప్రయత్నించినా చెల్లి ఆచూకీని తెలుసుకోలేకపోయారు.

వాడు ఎప్పుడైనా ఎక్కడైనా కనిపిస్తే కేలుకీయినా విరిచేయాలనిపిస్తుంది. జీవన్ తలపుకు రాగానే కోపోద్రేకంతో బిగుసుకుపోయాడు మురళి.

టపటపమని మీద పడుతున్న చినుకులకు ఉలిక్కిపడి గత స్మృతుల నుండి బయటపడి కంగారుగా లేచి వడివడిగా నడవసాగాడు మురళి.

వర్షం ఎక్కువ కావటంతో... కరెంటు పోయినందువల్ల చీకట్లో అడుగులు వేసుకుంటూ నడుస్తున్న... తన వెనుక ఏదో వాహనం వస్తున్న శబ్దం విని రోడ్డు ప్రక్కగా ఆగిపోయాడు మురళి!!

అనుకోని విధంగా తన ప్రక్కన ఫియట్ ఆగటం తనను రిసీవ్ చేసుకోగానే తాను ఎక్కి కూర్చోవటం క్షణంలో జరిగిపోయాయి.

తనకి కర్చీఫ్ అందిస్తూ, బాగా తడిసినట్లున్నారు తుడుచుకోండి..అంటూ మిమ్మల్ని ఎక్కడ డ్రాప్ చేయాలో కాస్త చెప్పండి ప్లీజ్ అంటూ మృదువుగా అడిగాడా వ్యక్తి.

ఇచ్చిన చేతి రుమాలును తిరిగి అతని కందిస్తూ... సిగార్‌తో సిగరెట్ అంటించుకుంటున్న అతని వైపు చూసిన మురళి గుండెల్లో బాంబు పేలినట్లయింది.

అతను...అతనెవరో కాదు..తన చెల్లిని మోసగించిన నయవంచకుడు జీవన్ అని గుర్తించగానే ఒక్కసారి కోపోద్రేకంతో బుసలు కొట్టి స్టీరింగ్‌ను పట్టుకొని కారు ఆపి అతన్ని ఆవేశంగా క్రిందకు లాగాడు మురళి.

ఏదో తెలియని పిచ్చి ఆవేశం తోడు కాగా అతడి గొంతు నులిమి మోరల్సొగా పడేట్టు బూటుకాలితో తన్ని కసితీర్చుకున్నాడు మురళి.

అమ్మో అన్న...గావు కేకతో నేలకొరిగిన జీవన్‌తోపాటు తన కాళ్లపైన పడిన డైరీ... అందులోవున్న కార్డు సైజు ఫోటోలు కొన్ని వెల్లావెదురై పడిపోయాయి.

తానేం చేశాడో... తనకే తెలియని..విద్యుత్ తోచని వాడిలా లైటు వెలుగులో క్రిందపడివున్న ఫోటోలవంక చూసి...అప్రయత్నంగా వంగి తీసుకున్న మురళి అదిరిపడి నిరుపనా వణికిపోయాడు.

ఆ ఫోటోలు ఎవరివో కాదు జీవన్‌తో తన ముద్దుల వెల్లాయి కలసి తీయించుకున్న పెళ్లి ఫోటోలతో సహా..ఇద్దరూ పాపబాబులతో కలిసి వున్నవి. ఒకటి కాదు రెండు కాదు అలా ఎన్నో భంగిమల్లో ఉన్నాయి.

డైరీ తిరగేస్తున్న మురళికి... వాళ్ల ఇంటి చిరునామా ... కళ్లకి ఇంకేమీ కనిపించటం లేదు.

— వి.నిర్మలాప్రియదర్శిని

# సమాధానం

"ఏమండీ మనిల్లు బాగాలేదండీ"

ఊం కొట్టాడు ఉమాపతి...

మళ్ళీ అదేమాట...

"అయితే ఇప్పుడేం చెయ్యాలంటావ్?"

"ఓ టీవీ..."

"అలాగే...."

కొన్నాళ్లకి మళ్ళీ

"ఏమండీ...బాగాలేదండీ..."

"ఊం"

"ఏం చెయ్యాలంటావ్?"

"ఓ ఫ్రిజ్..."

"ఓకే..."

కొంతకాలానికి మళ్ళీ

"ఏమండీ..."

"ఊం ఏం?"

"

"కార్పెట్..."

"కానియ్..."


కొంత మళ్ళీ గడిచాక

"ఏమండీ..."

నో రెస్పాన్స్...

"ఏమండీ?"

నో రెస్పాన్స్....



రెస్పాన్సివ్వకపోతే ఊరుకొని నోరుమూసుకోవడానికి ఆవిడ పేరు సూర్యకాంతం. పట్టి పిలిపించింది. వెంటనే వెళ్ళి ఓ డబ్బా కిరసనాయిలు తెచ్చాడు.

"మనిల్లు బాగాలేదు...అవునా?" అడిగాడు.

"అవును..."

"లేదు కదూ?"

"లేదు..."

"చేసిన అప్పు బాగుంది. అప్పుకి వడ్డీమీద వడ్డీ పెరగడం బాగుంది. బాగాలేనిదల్లా మనిల్లే... ఇలాంటి బాగా లేనిల్లు మనకెందుకూ... ఈ కిరోసిన్ పోసి ఒక్క అగ్గిపుల్ల..." ఆగేడు.

"ఆ" ఆమె నోరు తెరుచుకుపోతూ ఆశ్చర్యంతో పెద్దదైపోతోంది.

——అడబాల వి.వి.సత్యనారాయణ